బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో ఆదివారం జరిగిన ఫ్యాషన్ షోలో తళుక్కుమన్న రెజీనా కసాండ్రా

యువభారతి సేవలు వెలకట్టలేనివి

ఖైరతాబాద్, డిసెంబర్ 1:తెలుగు సాహిత్య రంగానికి యువతభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని వీరనారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ అన్నారు. యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, రసమయి, ఐఐఎంసీ కళాశాల సంయుక్తాధ్వర్యంలో కళాశాల ఆడిటోరియంలో తెలుగు వెలుగు సమాఖ్య ద్వితీయ సమావేశం యువభారతి వ్యవస్థాపక సమావేశకర్త ఆచార్య వంగపల్లి విశ్వనాథం అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ సూర్య ధనుంజయ మాట్లాడుతూ తెలుగు భాష సాహిత్యాల ప్రచారం కోసం యువభారతి ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో అవధానకర్త మరుమాముల దత్తాత్రేయ శర్మ, రసమయి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎంకే రాము, యువభారతి అధ్యక్షుడు డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, కార్యదర్శి జీడిగుంట వెంకట్రావు, ఐఐఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్, అధ్యాపకురాలు కల్యాణి, డాక్టర్ నారాయణ రెడ్డి, అక్కిరాజు సుందర రామకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏవియేషన్ రంగంలో యువతకు శిక్షణ

ఖైరతాబాద్, డిసెంబర్ 1 : ఏవియేషన్ రంగంలో యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు బిగ్ బ్రదర్ మెంటార్‌షిప్ ప్రోగామ్ వ్యవస్థాపకుడు సయ్యద్ ఆస్కారి తెలిపారు. సోమజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆఫ్టర్ థాట్ ఫీడ్ బ్యాక్ సర్వీసెస్ సంస్థ సీఈవో రాహుల్ పులుపూడితో కలిసి మాట్లాడారు. ఎరియర్‌లైన్ అండ్ కార్గో ఆపరేషన్స్, కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్, కార్పొరేట్ రెడీనెస్ లాంటి విభాగాలలో ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తామన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, డిసెంబర్ 1 : ప్రతి మూడు నెలలకోసారి ఏర్పాటు చేస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను ఈ నెల 14న నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అరుణకుమారి తెలిపారు. రాజీయే రాజమార్గం అన్న నానుడిని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాంపల్లి, సికింద్రాబాద్, మనోరంజన్ కోర్టు ప్రాంగణంలోని కోర్టులకు చెందిన పోలీసు స్టేషన్ల వారీగా కక్షిదారులు సంప్రదించి కేసులను తొలగించుకోవాలని స్పష్టం చేశారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం

కీసర, డిసెంబర్ 1: జీవో 317లోని నిబంధనలకు అనుగుణంగా ఉన్న భార్యాభర్తలు, ప్రాధాన్యత కేటగిరీలు పరస్పర బదిలీలు మాత్రమే చేయాలని నిర్ణయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని టీయూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామినేని వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి లచ్చుమల్ల వెంకన్న మాట్లాడుతూ జీవో నంబర్ 243, 244,245 జారీ చేసిన స్థానికతను పక్కన పెట్టుటపై తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ సంఘం అసంతృప్తి వ్యక్తం చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 317 జీవోను రద్దు చేస్తామనే మాట మరిచి క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసి కాలయాపన చేసిందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కార్పొరేటర్లు, బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 1 : కార్పొరేటర్లు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ నిర్లక్ష్యపూరిత వైఖరిని ఎండగడతూ..ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. ఆదివారం కూకట్‌పల్లి క్యాంపు ఆఫీస్‌లో నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు, డివిజన్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నేతలలో ఎమ్మెల్యే కృష్ణారావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 9న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు, జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో అన్ని రంగాలలో విఫలమైందని, భవిష్యత్‌లో బీఆర్ఎస్ పార్టీయే అధికారంలోకి వస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ నేతలంతా సంఘటితంగా ఉండాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, బీఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీశ్‌గౌడ్, సబిహాగౌసొద్దీన్, రోజాదేవి రంగారావు, కో ఆర్డినేటర్ సతీశ్‌అరోరా, మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబురావు, ఆయా డివిజన్‌ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు శ్రీహరి, శాఖయ్య, సురేశ్‌యాదవ్, ఐలయ్య, అంబటి శ్రీనివాస్, భిక్షపతి, ఇర్ఫాన్, సంతోష్, వెంకటేశ్, సుదర్శన్‌రెడ్డి, హరినాథ్, ఖాజా, నరేశ్, తిరుపతి, ఎర్రవల్లి సతీశ్, ఏజాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫికర్

నగరంలో ఆదివారం పలు చోట్ల ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఆటోలు, ద్విచక్రవాహనాలు గంటల తరబడి రోడ్డుపైన్నే నిలిచిపోవడంతో ఆందోళన చెందారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే విద్యార్థులు బలి

■ నాణ్యమైన భోజనం అందించకుంటే ఆందోళన చేస్తాం

■ టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్

అత్తాపూర్ బీసీ హాస్టల్‌లో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్1:రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజనంతో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని, విద్యార్థుల పాలిట మధ్యాహ్న భోజనం శాపంగా మారిందని టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. ఆదివారం అత్తాపూర్ బీసీ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్తాపూర్ బీసీ హాస్టల్‌లో నాణ్యమైన భోజనం లభించడం లేదన్నారు. గడిచిన వారం రోజుల నుంచి గురుకులాలతో పాటు మధ్యాహ్న భోజనంతో చాలామంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు. రెండు రోజుల క్రితం జమ్మికుంట కస్తూర్బా పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నిత్యశ్రీ అనే విద్యార్థిని పాఠశాల నిర్లక్ష్యంతోనే మరణించిందన్నారు. నాణ్యమైన భోజనం అందించడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హైకోర్టు మొట్టికాయలు వేసిన మార్పు రావడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు ఎక్కువ శాతం దళితులు, గిరిజనులు, బీసీలు ఉంటారని ప్రభుత్వంపై నమ్మకంతో విద్యార్థులను పాఠశాలల్లో చేర్పిస్తే ఇలా చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. మధ్యాహ్న భోజనం సరిగ్గా లేదని ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలపై నివేదిక తీసుకొని వెంటనే నాణ్యమైన భోజనాన్ని అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్‌వో రాజేంద్రనగర్ మండల అధ్యక్షుడు సంతోష్, నాయకులు వంశీకృష్ణ, సాయికిరణ్‌గౌడ్, నికిత్‌కుమార్, శ్రీకాంత్, శివప్రసాద్‌నాయుడు, వినోద్, రామాంజనేయులు, ఆనంద్‌కుమార్, ఉపేందర్, శివరాజ్, వినయ్‌కుమార్, అఖిల్, హర్షశివరాం, అన్వేశ్, అభిరామ్, రాజు, చంద్రశేఖర్, మల్లేశ్, గణేశ్, సాయికుమార్, వీర, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నేడు కలెక్టరేట్ల ముట్టడి

మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

చిక్కడపల్లి,డిసెంబర్1: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గురుకులాల్లో సొంత భవనాలు లేవని, కనీసం సౌకర్యాలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే విద్యార్థులు చనిపోతున్నారని విమర్శించారు. విద్యా వైద్యాన్ని జాతీయం చేసి నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి సోమవారం కలెక్టరేట్‌ల ముట్టడి చేపడుతామని తెలిపారు. డిసెంబర్ 3వ వారంలో ఇందిరాపార్క్ వద్ద 48 గంటల ఫీజు దీక్ష నిర్వహిస్తామన్నారు. ఈడబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు బీసీల నోట్లో మట్టికొట్టడానికేనని వాపోయారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేశ్ గౌడ్, జాతీయ అధ్యక్షుడు విక్రమ్ గౌడ్, నాయకులు శ్రీనివాస్ , అనిల్‌కుమార్, సాయితేజ, సంధ్యా, విజయలక్ష్మి, శ్యామల పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ ఎదుట ఆందోళన చేస్తున్న మాలమహానాడు నేతలు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆందోళన

రవీంద్రభారత్, డిసెంబర్ 1: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు నేతలు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ ఎదురుగా ఆదివారం ఆందోళన చేశారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ వీఎల్ రాజు, జేఎన్‌రావు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మాలల ఉద్యమాన్ని పక్కదారి పట్టించడానికి కాంగ్రెస్ మాల ఎమ్మెల్యేల ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మాలలను అణిచివేయడానికి కాంగ్రెస్, బీజేపీలు పూనుకున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా జాతీయ అధ్యక్షురాలు సీహెచ్ రోజలీలా, ఆర్ల రమేశ్, నక్క దేవేందర్‌రావు, పద్మ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు హేమలత తదితరులు పాల్గొన్నారు.

దోపిడీదారుల కోసమే బ్యాంకుల ప్రైవేటీకరణ

హిమాయత్‌నగర్,డిసెంబర్1: కార్పొరేట్ దోపిడీ దారుల కోసమే కేంద్ర ప్రభుత్వం బ్యాంకులను ప్రైవేటీకరణ చేస్తుందని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఏఐ బీఈఏ) జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు విమర్శించారు. ఇండియన్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నారాయణగూడలోని తాజ్ మహాల్ హోటల్‌లో బ్యాంకు మహిళా ఉద్యోగుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ దేశ అభివృద్ధి, పురోగతికి ప్రభుత్వ రంగ బ్యాంకులే కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ సదస్సులో అసోసియేషన్ మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ పద్మ, ఏపీ, టీఎస్ చైర్మన్ రాధాకృష్ణ, అధ్యక్షుడు ఎం.ఎస్.కుమార్, ప్రధాన కార్యదర్శి పి.వి.కృష్ణారావు, ఇండియన్ బ్యాంకు ఫీల్డ్ జనరల్ మేనేజర్ రాజేశ్వర రెడ్డి, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ మానిక బోపన్న, పాత్రికేయురాలు అజిత కాట్రగడ్డ తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న బి.ఎస్.రాంబాబు

ఆధునిక విద్యా విధానాలపై సదస్సు

సదస్సులో పాల్గొన్న యునెస్కో ప్రోగ్రాం ఆఫీసర్, సీబీఎస్ఈ స్కూళ్ల ప్రిన్సిపాల్‌లు

బంజారాహిల్స్,డిసెంబర్ 1: మారుతున్న కాలానికి అనుగుణంగా అత్యాధునిక విద్యావిధానాలతో పాఠశాలలను ఎలా సిద్ధం చేయాలనే అంశంపై 'హైదరాబాద్ సహోదయ స్కూల్స్ కాంప్లెక్స్'(హెచ్ఎస్ఎస్‌సీ) ఆధ్వర్యంలో 'సమన్వయ-2024' పేరుతో జాతీయ సదస్సును బంజారాహిల్స్‌లో నిర్వహించారు. రాష్ట్రంలోని 281 సీబీఎస్ఈ స్కూళ్లకు చెందిన ప్రిన్సిపాల్‌లు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్న ఈ సదస్సులో సరికొత్త విద్యావిధానాలు, మారుతున్న పరిస్థితులు తదితర అంశాలపై చర్చించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన యునెస్కోకు చెందిన నేషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సరితా జాదవ్ మాట్లాడుతూ గ్లోబల్ ఎడ్యుకేషన్ విధానానికి అనుగుణంగా విద్యాబోధనను మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ముంబై ఐఐటీ ప్రొఫెసర్ అజంతా సేన్, ఐఐఎం అహ్మదాబాద్ ప్రొఫెసర్ కాథన్ దుష్యంత్ శుక్లా,హెచ్ఎస్ఎస్‌సీ చైర్మన్ అమీర్ ఖాన్, వైస్ చైర్‌పర్సన్ డా.ఎబెనీజర్, సెక్రెటరీ రోజా పాల్, డా.సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న శంభు కింకిణి నృత్యోత్సవాలు

కొండాపూర్, డిసెంబర్ 1: మాదాపూర్‌లోని శిల్పారామంలో రెండు రోజులుగా కొనసాగుతున్న 'శంభు కింకిణి' నృత్యోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. నాట్య గురువులు పద్మ కళ్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్యోత్సవాలలో పలువురు నృత్యకారుల ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ముగింపు వేడుకల్లో భాగంగా అక్షత మానే సత్రియా నృత్యం, సుధా తమోతిరాం ఒడిస్సీ నృత్యం, చైతన్య కుసుమ ప్రియా భరతనాట్య నృత్య ప్రదర్శన, దేబశిష్ పేరిణి నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఈ కార్యక్రమానికి యోగ థెరపిస్ట్ హిమబిందు, తెలుగు యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వనజ ఉదయ్ తదితరులు హాజరై ప్రదర్శనలను తిలకించారు.



అయ్యప్ప మెట్టు మహాపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

అయ్యప్ప కృప ప్రజలపై ఉండాలి

కందుకూరు, డిసెంబర్ 1: అయ్యప్ప కృప ప్రజలపై ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కోరుకున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని రాచులూరులో బేతు రాఘవేందర్ రెడ్డి గురుస్వామి 18వ మెట్టు మహాపూజ బ్రహ్మ శ్రీ కుట్టన్ చంద్రమోహన్ గురుస్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్జున అవార్డు గ్రహీత వెదిరె రవికాంత్‌రెడ్డి, గురుస్వాములు, కుమార్, సత్యనారాయణరెడ్డి, మల్లారెడ్డి, శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బేతు రాంరెడ్డి, తాళ్ల కార్తీక్, నాగేశ్వర్‌రెడ్డి, బొక్క దీక్షిత్‌రెడ్డి, మద్ది అఖిల్‌రెడ్డి, కిరణ్ , బీఆర్ఎస్ పార్టీ నాయకులు అరవింద్ శర్మ, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రి సందర్శన

కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రిని సందర్శించిన అమెరికన్ కాలేజ్ ఆఫ్ నర్స్ మిడ్ వైవ్స్ ప్రతిధుల బృందం

బేగంపేట, డిసెంబర్ 1: అమెరికన్ కాలేజ్ ఆఫ్ నర్స్-మిడ్ వైవ్స్ ప్రతినిధుల బృందం ఆదివారం బేగంపేట లోని కిమ్స్-సన్ షైన్ హాస్పిటల్స్‌ను సందర్శించారు. వైద్య రంగంలో అవలంభిస్తున్న చికిత్స పద్ధతులు, ఆధునిక టెక్నాలజీతో కూడిన ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు. ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు ఉపయోగిస్తున్న వైద్య సదుపాయాలు చికిత్స విధానాలు అడిగి తెలుసుకున్నారు. అమెరికన్ కాలేజ్ నర్స్ మిడ్‌వైవ్స్ డెలిగేషన్ ప్రతినిధి డాక్టర్ కేథరీన్ కాలిన్స్-పులియాతో పాటు ప్రతినిధి బృందానికి కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధాకర్ జాదవ్, ఆసుపత్రి నర్సింగ్ సూపరిండెంట్ సైనీ చేరియన్‌తో కలిసి చర్చించారు. ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందజేస్తున్న కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రిని సందర్శించిన ఆధునిక వైద్య సేవల చికిత్స విధానాలను తెలుసుకోవడం తమకెంతో ఉపయోగపడుతుందని అమెరికన్ కాలేజ్ ఆఫ్ నర్స్-మిడ్ వైవ్స్ ప్రతినిధుల బృందం డాక్టర్ కేథరీన్ కాల్సిన్స్-పులియా తెలిపారు.

కశ్మీర్ ఉత్సవ్ మేళా

నెక్లెస్‌రోడ్ పీపుల్స్‌ప్లాజాలో ఏర్పాటు చేసిన కశ్మీర్ ఉత్సవ్ మేళాలో ఆదివారం సందర్శకులు బారులు తీరారు. యూట్యూబ్ ఫేమ్ కిరాక్ కాలా, ప్రియారెడ్డి, గుల్లు దాదాలతో సందడి చేశారు.

- ఖైరతాబాద్, డిసెంబర్ 1

కరాటే పోటీల్లో సత్తాచాటిన చిన్నారి

మియాపూర్ , డిసెంబరు 1 : హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్ కాలనీకి చెందిన విద్యార్థి బిలహరి దక్షిణాఫ్రికా దర్బన్‌లో నవంబరు 29, 30 వ తేదీన జరిగిన కామన్ వెల్త్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో అండర్ 11 విభాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ముగ్గురు చిన్నారులు పోటీ పడగా బిలహరి సత్తా చాటింది.

ఎక్కడి చెత్త అక్కడే ..

రోడ్లపై ఎక్కడి చెత్త అక్కడే ఉండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నాచారంలోని చిలుకానగర్‌లో ఆదివారం ఇలా రోడ్డుపై చెత్త దర్శనమిచ్చింది. గత ప్రభుత్వంలో చెత్తను ఎప్పకప్పుడు తొలగించేవారని .. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. చెత్తతో దుర్వాసన భరించలేకపోతున్నామని వాపోయారు.

వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

పరిగి, డిసెంబర్ 1 : బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై మంత్రులు కొండా సురేఖ, సీతక్క చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకొని, క్షమాపణలు చెప్పాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకుడు మంచన్‌పల్లి ఆనంద్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు లాజర్ డిమాండ్ చేశారు. మంత్రులు చేసిన వ్యాఖ్యలను వారు ఖండిస్తూ ఆదివారం పరిగిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురుకులాల కార్యదర్శిగా పనిచేసిన ప్రవీణ్‌కుమార్ గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా కృషి చేయడంతోపాటు పూర్ణ, ఆనంద్‌లు ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించేలా చేసిన ఉన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్, ఉద్యమ నాయకుడు సింగం పాల్గొన్నారు.